వృద్ధులు.. రోగులకు.. తప్పని నిరీక్షణ

- మధుమేహం.. ఇతర పరీక్షల కోసం గంటల పాటు వేచి ఉండే పరిస్థితి
- అధికారులు స్పందించాలంటున్న బాధితులు







కప్పరాడ ప్రజారోగ్య కేంద్రం గేట్లు తీయకపోవడంతో బయట వేచి ఉన్న రోగులు

కంచరపాలెం: కంచరపాలెం కొండవాలు ప్రాంత పరిధి కప్పరాడ ప్రజారోగ్య కేంద్రం సిబ్బంది నిర్లక్ష్యం రోగులకు శాపంగా మారింది. రక్త పరీక్షలు, మధుమేహ (షుగర్) పరీక్షలకు వచ్చే రోగులు ఉదయం గంటల తరబడి సిబ్బంది కోసం వేచి ఉండాల్సి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు ప్రతి నెల క్రమం తప్పకుండా షుగర్ పరీక్షలను ఫాస్టింగ్, రాండమ్‌లో చేయించుకోవాలి. ఉదయం పూట పరగడుపున వచ్చి పరీక్షలు చేయించుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. వైద్య కేంద్రం ప్రధాన గేట్లు సమయానికి తీయకపోవడంతో గంటల సమయం వేచి చూడాల్సి వస్తుందంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజారోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసి వైద్యానికి పెద్ద పీట వేశారని చెబుతున్నారు. నేడు ప్రజా వైద్యం అంతంత మాత్రంగానే అందుతుందని వాపోతున్నారు. నేడు పలు రక్త పరీక్షలు బయటి ల్యాబ్‌లలో చేయించుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమయపాలన పాటించాలి..

వైద్య కేంద్రం సిబ్బంది సమయపాలన పాటించక పోవడంతో రోగులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఉన్నత వైద్యాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వైద్య సిబ్బంది అలసత్వం వహిస్తున్నారని రోగులు చెబుతున్నారు. ఆరోగ్య పరీక్షలకు వచ్చే రోగులకు మరింత అనారోగ్యం వచ్చే పరిస్థితి కనిపిస్తుందని వాపోతున్నారు. మధుమేహం (షుగర్), హిమోగ్లోబిన్ (హెచ్‌బీ), క్షయ (టీబీ), థైరాయిడ్, ఆర్‌బీసీ, డబ్ల్యుబీసీ, లింప్, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, చికున్ గున్యా రోగాలకు పరీక్షలు చేయించుకునేందుకు నిత్యం ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వైద్య కేంద్రాన్ని పర్యవేక్షించి సిబ్బంది సమయపాలన పాటించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వృద్ధులకు ఇబ్బందులు..

కప్పరాడ వైద్య కేంద్రంలో పరీక్షలకు వచ్చే రోగులు సిబ్బంది కోసం వేచి ఉండాల్సి వస్తోంది. సమయపాలన పాటించకపోవడం వల్ల వృద్ధులు, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న రోగాలతో పాటు కొత్తవి వచ్చేలా ఉన్నాయి. వైద్య సిబ్బంది సమయపాలన పాటించేలా చూడాలి.

– జి.రామునాయుడు, రాంజీ ఎస్టేట్, కంచరపాలెం

అధికారుల పర్యవేక్షణ తప్పనిసరి..

కప్పరాడ ప్రజారోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో మరిన్ని రోగాలకు గురవుతున్నాం. ఉదయమే పరగడుపుతో రక్త పరీక్షలు జరిగితే ఫలితం సక్రమంగా వస్తుందని వైద్యులు సూచిస్తున్నారు. ఇక్కడ ఆ సమయానికి రక్త పరీక్షలు నిర్వహించే పరిస్థితి కనిపించడం లేదు. అధికారులు స్పందించాలి.

– కె.పైడిరాజు, కప్పరాడ, కంచరపాలెం

ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ సాధ్యం



క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సౌదామిని

మురళీనగర్: ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్ వ్యాధి నివారణ సాధ్యమని ఓమ్ని హాస్పిటల్ స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ బి.సౌదామిని అన్నారు. మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు కె.మాధవి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన నెలవారి సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని క్యాన్సర్ వ్యాధి నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. కణజాల విభజన గాడి తప్పడం వల్ల కణాలు ఒక దానిపై ఒకటి పేరుకుపోయి కణితుల్లా మారి క్యాన్సర్ వస్తుందని, క్యాన్సర్ వ్యాధి కాదని చెప్పారు. మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామం ద్వారా క్యాన్సర్‌కు దూరంగా ఉండవచ్చన్నారు. యుక్త వయస్సులో ఆడపిల్లలు వైద్యుల సూచన మేరకు ప్రతి ఆరు నెలలకోసారి హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేసుకుంటే వివాహానంతరం సర్వైకల్ క్యాన్సర్ రావటానికి ఆస్కారం ఉండదన్నారు. 40 సంవత్సరాలు దాటిన మహిళలు మెనోపాజ్ టైంలో శరీరంలో ఏమైనా మార్పులు వస్తే వైద్య పరీక్ష చేసుకోవాలని చెప్పారు. క్రమం తప్పకుండా వ్యాయామం, నడక, ధ్యానం చేయాలని చెప్పారు. 40 సంవత్సరములు పైబడిన మహిళలు ప్రతి రెండు సంవత్సరములకు ఒకసారి స్క్రీనింగ్ టెస్ట్ చేయించుకోవడం మంచిదన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి పి.కమల, కోశాధికారి ఎం.శేష మణి, ఉపాధ్యక్షులు సీహెచ్ వరలక్ష్మి, ఎస్.పుష్ప లత, పూర్వ కార్యదర్శి సుశీల బిందు, ఎడిటర్ శిరీష, జాలీ వాకర్ సుగుణ, కృష్ణవేణి, రాధ, శోభ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కె.కె. రాజుతో ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిన్నా భేటీ



కె.కె. రాజుని మర్యాదపూర్వకంగా కలిసిన చిన్నా

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కొరువాడ చిన్నాను నియమిస్తూ పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర నెడ్‌క్యాప్ మాజీ చైర్మన్, నియోజకవర్గ సమన్వయకర్త కె.కె. రాజుని చిన్నా మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తాను ఈ పదవిని సమర్థవంతంగా నిర్వహించి నియోజకవర్గంలో ఎస్సీ సెల్ విభాగాన్ని పటిష్టం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా చిన్నాకు కె.కె. రాజు అభినందనలు తెలిపారు.

చందన మారుతి దర్శనం



మురళీనగర్: జాతీయ రహదారిని ఆనుకుని సూర్యానగర్‌లో వెలసిన యోగసిద్ధాంజనేయ స్వామి ఆలయం 14వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామిని చందన మారుతిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామికి పూజలు చేశారు. వారికి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ వ్యవస్థాపకుడు పెనుమత్స సుబ్బరాజు పాల్గొని పూజలు చేశారు.

సర్వేలు పక్కాగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీటీసీవో డాక్టర్ పూర్ణేంద్రబాబు

కంచరపాలెం: ప్రజలు ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడంతో పాటు అప్పగించిన సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని డీటీసీవో డాక్టర్ పూర్ణేంద్రబాబు సూచించారు. క్షయ వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఆర్పీపేట ప్రధాన వైద్యాధికారి డాక్టర్ మట్టా శశిప్రియాంక ఆధ్వర్యంలో జరిగిన ఆశా-డే సమావేశానికి పూర్ణేంద్రబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలకు లెప్రసీ, క్షయ వ్యాధులపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వీ భారతీ, టీబీహెచ్‌వీ నూనెల పైడిరాజు, ఎల్‌టీ పూర్ణిమ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా భ్రమరాంబ, మల్లికార్జునస్వామి పరస



పరసలో భక్తుల సందడి

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు రామాటాకీస్ దరి శ్రీనగర్ కాలనీలో గల శ్రీ శివాలయంలో భ్రమరాంబిక, మల్లికార్జున స్వామిల పరస మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ మేరకు మంగళవారం ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఘనంగా పరస జరిగింది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. శ్రీనగర్, రామాటాకీస్, ఆశీలమెట్ట, అశోక్‌నగర్, అక్కయ్యపాలెం తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి పరసలో పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు



సుబ్రహ్మణ్య స్వామికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తుడు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం ఊర్వశి జంక్షన్ కూడలి రవీంద్రనగర్‌లో గల సుబ్రహ్మణ్యస్వామికి ఆలయ అర్చకులు రామకృష్ణశర్మ స్కంద పూజలు నిర్వహించారు. అష్టోత్తర శత కలశాభిషేకం, సహస్రనామం, విభూది, పుష్పాలతో అర్చనలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. శరవణ ట్రస్ట్ చైర్మన్, ఆలయ ధర్మకర్త దేవాల రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

ఈ-శ్రమ్‌తో సామాజిక భద్రత



ఆటో డ్రైవర్లకు ఈశ్రమ్ దరఖాస్తులు అందజేస్తున్న డీసీఎల్ సునీత

సీతంపేట: అసంఘటిత రంగ కార్మికులకు ఈ-శ్రమ్ నమోదుతో సామాజిక భద్రత లభిస్తుందని కార్మికశాఖ డిప్యూటీ లేబర్ కమిషనర్ ఎం.సునీత అన్నారు. అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లో గల కార్మిక శాఖ కార్యాలయంలో ఆటో డ్రైవర్లకు ఈశ్రమ్ నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 16 నుంచి 59 సంవత్సరాల మధ్య వయసు గల కార్మికులు, భవన నిర్మాణ పనివారు, చేతి వృత్తుల వారు, వ్యవసాయ కార్మికులు, హమాలీలు, దుకాణాల్లో పని చేసేవారు, ఆశ వర్కర్లు, మత్స్య కార్మికులు, పాల వ్యాపారులు, స్వయం ఉపాధి వారు, కొరియర్ బాయ్స్, స్విగ్గీ, జొమాటో డెలివరీ బాయ్స్ , రవాణా రంగ కార్మికులు, తోపుడు బండి వ్యాపారులు ఈ-శ్రమ్ నమోదుకు అర్హులని తెలిపారు. వార్డు సచివాలయంలో గాని, సీఎస్‌సీ కేంద్రాలలో గాని, మీ సేవా, పోస్టాఫీసులు, స్మార్ట్ ఫోన్ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ నంబరు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్, సెల్ ఫోన్ నంబరు ఉంటే ఈశ్రమ్ నమోదు చేసుకోవచ్చన్నారు. ఈశ్రమ్ నమోదు వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలకు అర్హత లభిస్తుందన్నారు. అలాగే ప్రమాదకర మరణానికి రూ. 2 లక్షల బీమా, శాశ్వత అంగ వైకల్యానికి రూ.1 లక్ష ఆర్థిక సాయం లభిస్తుందన్నారు. తప్పకుండా అర్హులైన కార్మికులంతా ఈశ్రమ్ నమోదు చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా నమోదు చేసుకున్న ఆటో డ్రైవర్లకు ఈశ్రమ్ గుర్తింపు కార్డులు, నమోదు చేసుకోని వారికి దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీఎల్‌లు జి.రాజు, ఆర్.రమ, ఆటో డ్రైవర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి పడాల గోవిందు, ప్రెసిడెంట్ ఎస్.మధురెడ్డి, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి వై.రాజు, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

12న ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో సంపత్ వినాయకుడు

కంచరపాలెం: కంచరపాలెం పరిధి తిక్కవానిపాలెం కాలనీలో సంపత్ వినాయక పార్వతీ విశ్వేశ్వర సాయి ఆలయ 25వ వార్షికోత్సవం కాలనీ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 12 బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామాధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. ఆ రోజు ఉదయం ఆలయంలో ఆయా దేవతామూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, రుద్రహోమం, పూర్ణాహుతి, కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం ప్రసాద వితరణ, సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, స్వామివారి తిరువీధి ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. కల్యాణ మహోత్సవంలో పాల్గొనే దంపతులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని గనగల శంకర్ తెలిపారు. ఇప్పటికే ఆలయాన్ని సుందరంగా అలంకరించే రంగులు, విద్యుత్‌లైట్ల పనులు జరుగుతున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

తెలుగు వ్యక్తినే ఉక్కు సీఎండీగా నియమించాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విదసం ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ బూసి వెంకటరావు

సీతంపేట: త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ విలువ తెలిసిన తెలుగు సీఎండీ మాత్రమే కేంద్రం ఇచ్చిన ప్యాకేజీతో పరిశ్రమను పునరుద్ధించగలరని విస్తృత దళిత సంఘాల (విదసం) ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ బూసి వెంకటరావు అన్నారు. రామా టాకీస్ వద్ద గల అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్యాకేజీ ద్వారా ప్లాంటును కాపాడాలని అన్నారు. ఇపుడున్న సీఎండీ, ఉత్తరాది రాష్ట్రాల డైరెక్టర్లకు విశాఖ ఉక్కు పోరాట చరిత్రలు తెలియవన్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో పరిశ్రమను తిరిగి నిలబెట్టడానికి విశాఖ ఉక్కు, ఆంధ్రుల హక్కు నినాదం, ప్రాణ త్యాగం అర్థం తెలిసిన తెలుగు అధికారులు కావాలని ప్లకార్డులు ప్రదర్శించారు. సీఎండీతో పాటు, కీలకమైన ఆపరేషన్, కమర్షియల్, ఫైనాన్స్ డైరెక్టర్లను తెలుగు వారిని నియమించేలా చంద్రబాబు కేంద్రాన్ని ఒప్పించాలన్నారు. అలాగే ప్యాకేజీ నిధుల నుంచి ముడిసరుకు కొనుగోలుకు, ఆకలితో ఉన్న ఉద్యోగులు, కాంటాక్టు కార్మికుల జీతాల చెల్లింపునకు అనుమతి కోరాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్, నీటి చార్జీలు పూర్తిగా రద్దు చేయాలని, మాదారం, జగ్గయ్యపేటలో జరిగే మైనింగ్‌పై రాయల్టీ వాయిదా వేయాలని కోరారు. కాంట్రాక్టు కార్మికుల తొలగింపును నిలిపివేసి , నిర్వాసితలకు ఉపాధి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ప్లాంటు స్థితి గతులపై ముఖ్యమంత్రి నేతృత్వంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్ష చేసి యాజమాన్యానికి సలహా మండలిగా ఉండాలని కోరారు. పోలవరం, అమరావతి నిర్మాణానికి విశాఖ ఉక్కునే కొనుగోలు చేయాలన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని ప్రధాని చేత ముఖ్యమంత్రి ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సోడదాసి సుధాకర్, జాజి ఓంకార్, గొల్లమాల అప్పారావు, గుడాల ఈశ్వరరావు, బూల భాస్కర్‌రావు, రాజేంద్రప్రసాద్, రవిశేఖర్, రవి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

షబ్నంకు అభినందనల వెల్లువ



షబ్నంను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు



షబ్నంకు శుభాకాంక్షలు తెలుపుతున్న సీడీపీవో రమణకుమారి

మధురవాడ/మద్రిపాలెం: అండర్-19 టీ-20 వరల్డ్ కప్‌లో విశేషంగా రాణించిన షబ్నమ్ షకీల్‌కు ఘన స్వాగతం లభించింది. టోర్నీ ముగించుకుని మంగళవారం విశాఖ చేరిన ఆమెకు జీవీఎంసీ 53వ వార్డు జాకీర్ హుస్సేన్‌నగర్, పార్వతీనగర్ ప్రజలు స్వాగతం పలికారు. జాకీర్ హుస్సేన్‌నగర్ కమిటీ సభ్యులు, ముస్లిం మహిళలు, ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. మహిళలు ఏ విషయంలోనూ తక్కువ కాదని షబ్నం షకీల్ మరోసారి నిరూపించిందని వారంతా కొనియాడారు. అనంతరం జాకీర్ హుస్సేన్‌నగర్ వద్ద గౌస్ పాక్ నిషానీని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

సీడీపీవో అభినందన..

అండర్ 19 భారత్ మహిళల క్రికెట్ జట్టులో సత్తా చాటిన క్రీడాకారిణి షబ్నం షకీల్‌కు మద్రిపాలెంలోని ఆమె నివాసంలో ఐసీడీఎస్ అర్బన్ సీడీపీవో రమణకుమారి అభినందనలు తెలిపారు. ఇలాంటి విజయాలు మరెన్నో సాధించాలని, దేశగౌరవాన్ని చాటి చెప్పాలని ఆమె ఆకాంక్షించారు.

ఎస్సీ వసతి గృహాలకు మరమ్మతులు



ఎస్సీ బాలుర వసతిగృహంలో జరుగుతున్న మరమ్మతులు

సీతమ్మధార: విశాఖలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహాలకు మరమ్మతులకు గాను ప్రభుత్వం నిధులు విడుదల చేయడం తెలిసిందే. ఇందులో భాగంగా సీతమ్మధారలో గల రెండు వసతి గృహాలకు రూ.7.68 లక్షల నిధులు విడుదల చేశారు. కాగా ఇక్కడి ప్రీమెట్రిక్ వసతి గృహానికి రూ.5 లక్షలు మంజూరు చేశారని వసతిగృహం అధికారి సరోజిని తెలిపారు. ఈ వసతిగృహంలో 49 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ పనులు త్వరలోనే ప్రారంభం అవుతాయని సమాచారం. అలాగే కళాశాల బాలుర వసతి గృహానికి రూ.2.68 లక్షల వంతున నిధులు విడుదల చేశారని వసతిగృహం అధికారి ప్రసాద్ వెల్లడించారు. ప్రీ మెట్రిక్ వసతి గృహంలో రేకుల షెడ్డు విస్తరణ, శ్లాబు ఏర్పాటు, ఇతర మరమ్మతు పనులు చేయనున్నారు. ఇక కళాశాల బాలుర వసతి గృహంలో గచ్చులు, ఇతర పనుల కోసం మరమ్మతు పనులు రెండు రోజుల క్రితమే ప్రారంభం అయ్యాయి. ప్రస్తుతం మెట్ల పక్కన స్టీల్‌రాడ్ల ఏర్పాటు, షెడ్ల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. కళాశాల బాలుర వసతిగృహంలో 107 మంది విద్యార్థులు ఉన్నారు.

ఘనంగా రథసప్తమి



గణేశ్‌నగర్ త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

సీతమ్మధార: స్థానిక 14వ వార్డు నరసింహనగర్ శివారు గణేశ్‌నగర్‌లో గల శ్రీ త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయంలో కొలువై ఉన్న శ్రీ సూర్యనారాయణమూర్తికి మంగళవారం రథసప్తమి సందర్భంగా క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఏడిద గురునాథ శర్మ, సహాయ అర్చకులు కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు మూర్తి, కార్యవర్గ సభ్యులు ప్రకాశరావు, వెంకటరావు, రమణ, ఎ. కృష్ణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



సూర్య నమస్కారాలు చేస్తున్న వేద పండితులు

శాస్త్రోక్తంగా రథసప్తమి పూజలు..

సీతంపేట: రథసప్తమి సందర్భంగా శ్రీలలితా పీఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రాల మధ్య సూర్య నమస్కారాలు, మహా సౌరహోమం శాస్త్రోక్తకంగా నిర్వహించారు. పలువురు భక్తులు ఆలయంలో సూర్యనారాయణ మూర్తి విగ్రహానికి పూజలు చేశారు. గ్రహదోషాలు నివారించి, ఆరోగ్యం ప్రసాదించమని వేడుకున్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అలరించిన శీతల్ స్వర్



పాల్గొన్న గాయనీ గాయకులు, అతిథులు

సీతంపేట: శీతల్ స్వర్ సంగీత సంస్థ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. రైటర్స్ అకాడమీ అధ్యక్షుడు వి.వి.రమణమూర్తి, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ జ్యోతి ప్రజ్వలన చేసి సంగీత విభావరిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శీతల్ స్వర్ సంస్థను స్థాపించి కళాకారులను ప్రోత్సహిస్తున్న సంస్థ వ్యవస్థాపకురాలు బి. లక్ష్మి సేవలను కొనియాడారు. అనంతరం నగరానికి చెందిన గాయనీ గాయకులు పలు తెలుగు చిత్రాల్లోని పాటలు ఆలపించి అలరించారు. ఈ కార్యక్రమంలో కళా సంస్థల ప్రతినిధులు చెన్నా తిరుమలరావు, ఎ.వెంకట్, పి. బాబ్జి, అంజనేయరెడ్డి, నర్సింగ్, ఎల్.వెంకటేష్, బి.శ్రీనివాస్, బి.శీతల్, సీ.హెచ్.వి. సత్యనారాయణ, కొణతాల రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డే పార్కింగ్ స్థలం



టీపీటీ కాలనీలో మెయిన్ రోడ్డు మీదే వాహనాల పార్కింగ్

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు పరిధిలో గల టీపీటీ కాలనీలో ట్రాఫిక్ కష్టాలు తీరకపోగా రోజూ రెట్టింపు అవుతున్నాయని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇక్కడ ఒకవైపు రైతుబజార్ రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు ఇబ్బంది పెడుతుండగా.. ఎదురుగా ఉన్న టీపీటీ కాలనీ షాపింగ్ కాంప్లెక్సు ఎదుట వాహనాల పార్కింగ్ వల్ల తీవ్ర దుమారం రేగుతోంది. ఇక్కడి దుకాణాల ఎదురుగా ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు యథేచ్ఛగా పార్కింగ్ చేస్తున్నా పట్టించుకున్న నాథుడే కరవయ్యాడు. రైతు బజార్‌కి వచ్చే వినియోగదారులు కూడా ఇక్కడే వాహనాలు పార్కింగ్ చేయడం గమనార్హం. ఇక్కడి కేఎస్ఆర్ కాంప్లెక్స్‌లో గల వాణిజ్య సముదాయాలు, కల్యాణ మండపాలకు వచ్చే వినియోగదారులు, ప్రజలు తమ వాహనాలను సెల్లార్‌కి బదులుగా రోడ్డు మీదే పార్కింగ్ చేయడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. ఈ మార్గంలో ఎక్కడా ట్రాఫిక్ కానిస్టేబుల్ బీట్ సైతం లేదు. దీంతో వాహన చోదకులు నచ్చినట్లు పార్కింగ్ చేస్తున్నారని స్థానికులు, పాదచారులు ఆందోళన చెందుతున్నారు. ఈ మార్గంలో ఆరిలోవ-రైల్వేస్టేషన్ వెళ్లే 69 నంబర్ సిటీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. అలాగే తహసీల్దార్ కార్యాలయం, యూనియన్ బ్యాంకు, ఇతర దుకాణాలకు రాకపోకలు సాగించే ప్రజలు ఈ మార్గం ద్వారానే ప్రయాణాలు సాగిస్తారు. కాని,నిత్యం టీపీటీ కాలనీ మెయిన్‌రోడ్డు మీదే వాహనాలు పార్కింగ్ చేస్తున్నా ద్వారకా ట్రాఫిక్ పోలీసులు పత్తా లేరని స్థానికులు, పాదచారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

యూజీడీ కోసం తవ్వారు.. పూడ్చడం మరిచారు



పూడ్చకుండా వదిలేసిన గొయ్యి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని 60 అడుగుల శ్మశానం రోడ్డులో పూడ్చకుండా వదిలేసిన గొయ్యి ఇటు పాదచారులు, అటు వాహన చోదకులను తీవ్రంగా ఇబ్బంది పెడుతుందని స్థానికులు వాపోతున్నారు. సీతమ్మధార దరి ఎంఎంటీసీ కాలనీ నుంచి క్రాంతినగర్ జాతీయ రహదారి వైపు వెళ్లే మార్గంలో ఈ గొయ్యి అందరినీ భయపెడుతుందని తెలిపారు. యూజీడీ మరమ్మతు పనుల కోసం ఇక్కడ జోన్-3 నీటి సరఫరా విభాగం సిబ్బంది తవ్వారని స్థానికులు చెబుతున్నారు. వారాలు, నెలలు గడుస్తున్నా గొయ్యి మాత్రం పూడ్చడం లేదని వాపోతున్నారు. ముఖ్యంగా రాత్రి పూట ఈ గొయ్యి కనిపించక పాదచారులు, వాహన చోదకులు అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పోర్టు ఆస్పత్రిని కాపాడుకుందాం



పోర్టు ఆస్పత్రి వద్ద రిలే దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం: పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుంటామని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కె. సత్యనారాయణ తెలిపారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గత 127 రోజులుగా పోర్టు ఆస్పత్రి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొన్నారు. పోర్టు ఆస్పత్రి టెండర్‌కు వచ్చిన వారిని అడ్డుకోవాలని, తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రైవేటీకరణ నిర్ణయం అనైతికమని, ఆస్పత్రి అభివృద్ధి కార్మికుల కృషితోనే సాధ్యమైందని, సుమారు 40 వేల మంది కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రైవేట్ వారికి అప్పగించడం అనర్థమని తెలిపారు. విశాఖపట్నం పోర్టు విశాఖ అభివృద్ధికి కీలకమని, ప్రతి ఏటా మున్సిపాలిటీకి సగటున రూ. 65 కోట్లు పన్ను కడుతుందని అన్నారు. అటువంటి పోర్టును ప్రైవేటుకు అప్పగించడం అభివృద్ధికి అడ్డుగా నిలుస్తుందన్నారు. టెండరు ప్రక్రియ పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వి. రామలింగేశ్వర్రావు, కేఎస్ కుమార్, బి. రాజగోపాల్, సీహెచ్‌వీఎస్ రెడ్డి, జీసీహెచ్‌వై నాయుడు, రాఘవులు, ఈశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.